నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 22 మార్చి 2025 | KARIMNAGAR




కొడిమ్యాల: పిడుగుపాటుతో కాలిపోతున్న తాటిచెట్టు



పెద్దపల్లి రూరల్ : కురిసిన వడగండ్లు



కరీంనగర్: ఆకాశంలో మెరుపులు



నగరంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## 'పది' పరీక్షలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, మార్చి 21 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. వీటి కోసం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేయగా మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్ జిల్లాలో 12,188 మందికి 12,173 మంది విద్యార్థులు హాజరయ్యారు. జగిత్యాల జిల్లాలో 11,838 మందికి 11,826 మంది పరీక్ష రాశారు. పెద్దపల్లి జిల్లాలో 7,388 మందికి 7,379 మంది పరీక్షకు హాజరయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6,766మందికి 6,752 మంది పరీక్షలు రాశారు.

# ముంచిన అకాలవాన

పంటలు చేతికొచ్చిన దశలో అకాల వర్షం ముంచింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శుక్రవారం అకాల వాన దంచికొట్టింది. సాయంత్రం భారీగా గాలులు వీస్తూ ఉరుములు మెరుపులతో కురిసింది. అక్కడక్కడా రాళ్ల వాన పడింది. దీంతో చేతికొచ్చిన వరి, మక్క పంటలతోపాటు మామిడి తోటలకు తీరని నష్టం వాటిల్లింది. అసలే సాగునీరు లేక అకష్టకష్టాలు పడుతున్న రైతన్నపై ఈ వాన మరింత ప్రభావం చూపింది.



చొప్పదండి: అకాల వర్షానికి నేలవాలిన మక్క చేను



కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో కారు వెలుతురులో చదువుతున్న పదో తరగతి విద్యార్థి

## కరెంట్ అంతరాయం.. విద్యార్థుల తిప్పలు

కమాన్‌చౌరస్తా/ ముకరంపుర మార్చి 21: అకాల వర్షంతో అక్కడక్కడా అంధకారం అలుముకున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలిగింది. దుర్శేడ్‌లోని 220కేవీ సబ్‌స్టేషన్‌లో టెక్నికల్ సమస్యతో వావిలాలపల్లె, వాటర్ వర్క్స్, పద్మనగర్ 133కేవీ సబ్ స్టేషన్లకు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ ప్రభావంతో నగరంలోని అన్ని 33/11కేవీ సబ్‌స్టేషన్లతోపాటు సమీప మండలాలకు సరఫరా ఆగిపోయింది. దీంతో నగరంలో అరగంటకుపైగా అంధకారం నెలకొన్నది. సరఫరాను తిరిగి పునరుద్ధరించినా కరెంట్ వస్తూ పోతూ ఉండడంతో తీవ్ర అవస్థ పడ్డారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. పరీక్షల వేళ కరెంట్ కావడంతో కొందరు సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో, మరి కొందరు కార్లలో లైట్లు వేసుకొని చదువుకున్నారు.



చొప్పదండి: రోడ్డుపైన నిలిచిన వర్షపు నీరు

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- అక్కడక్కడా రాళ్లవాన
- దెబ్బతిన్న పంటలు
- రైతన్నకు నష్టం



పెగడపల్లిలో నేల రాలిన మామిడి కాయలు

కరీంనగర్, మార్చి 21(నమస్తే తెలంగాణ) : అకాల వాన అన్నదాతను హడలెత్తించింది. శుక్రవారం సాయంత్రం తర్వాత బెంబేలెత్తించింది. ఈదురుగాలుకు తోడు రాళ్లవాన దంచికొట్టింది. పెద్దపల్లి మండలంతోపాటు ధర్మారం, రామగిరి, సుల్తానాబాద్, మంథని ఓదెల మండలాల్లోని పలు గ్రామాల్లో సైతం భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లాలోని గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దాదాపు జిల్లా అంతట చిరుజల్లులు పడగా, చొప్పదండి మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి, వేములవాడ, కోనరావుపేట, రుద్రంగి మండలాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. భారీ వర్షంతో కోతకు వచ్చిన వరి నేలపాలై రైతుకు నష్టం చేసింది. కొన్ని మండలాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలకేంద్రంలో భారీ వర్షం కురిసింది. ఉమ్మడిజిల్లాలో పలు చోట్ల 40 నిమిషాల పాటు రాళ్లతో వర్షం కురవడంతో రైతులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పొట్ట దశలో వరిపై రాళ్లవాన కురవడం రైతులను తీవ్రంగా కలిచివేసింది. మామిడి పూత కాత రాలి భారీ నష్టాన్ని కలిగించింది. రేపు ఎల్లుండి సైతం జిల్లాలో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## శ్రేణులు తరలిరావాలి

- సమావేశం విజయవంతం చేయాలి
- 'సిల్వర్ జూబ్లీ'ని సంబురంగా జరుపుకొందాం
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ముస్తాబాద్, మార్చి 21: రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలను సంబురంగా జరుపుకొందామని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 23న కేటీఆర్ నిర్వహించే సన్నాహక సమావేశానికి శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్ని జిల్లాల్లో పర్యటించి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారని వెల్లడించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలతోపాటు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కేటీఆర్ కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా.. గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఏడాదిన్నరలోనే కాంగ్రెస్ సర్కారుపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ మండల మాజీ కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్‌పాషా, పార్టీ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, పట్టణ మాజీ అధ్యక్షుడు గూడూరి భరత్, మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు తాళ్ల రాజు కంచం నర్సింలు, జాహింగిర్, కోడె శ్రీనివాస్,పల్లె సత్యం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

## అరాచక పాలనపై పోరాటం చేద్దాం

### కేటీఆర్ సభను విజయవంతం చేద్దాం


- హామీల అమలులో సర్కారు విఫలం
- పదిహేను నెలలుగా ఓపిక పట్టాం
- కాంగ్రెస్ అరాచక పాలనపై పోరాటం చేద్దాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, మార్చి 21: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ అయ్యారని, ఆయన హయాంలో ఎవరికీ కొత్తగా సంక్షేమ పథకాలు అందలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. హామీలు అమలు కోసం పదిహేను నెలలు ఓపిక పట్టామని.. ఇకనుంచి సర్కారు అరాచక పాలనపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వజ్రోత్సవాల నేపథ్యంలో ఈ నెల 23న కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అధ్యక్షతన జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు సంబంధించిన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ, రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతులకు అందడం లేదని.. ఇదేంటని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు, ఉద్యోగులు, ఆర్టీసీ, విద్యుత్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉద్యమాలతో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చేదాకా ఓపిక పట్టాలని, పార్టీని వీడిన నాయకుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం కరీంనగర్‌లో కేటీఆర్ నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, కేటీఆర్ నిర్వహించే సమావేశానికి జగిత్యాలలోని మూడు నియోజకవర్గాల నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనపై పోరాటం చేయడమే మనముందున్న లక్ష్యమన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హొద్దినేని హరిచరణ్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమావేశం సక్సెస్ చేద్దాం

- పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మార్చి 21: కరీంనగర్‌లో ఈ నెల 23న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపినిచ్చారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు సాగి మహిపాల్ రావు, కంకణాల విజేందర్‌రెడ్డి, ఆకుల మధుసూదన్, వేముల దామోదర్, మడ్లపెల్లి గంగాధర్, రామిడి సురేందర్, ఎండీ నజీర్, దూలం శంకర్‌గౌడ్, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, ముక్కెర మల్లేశం, వడ్లూరి ఆదిమల్లు, శ్రీమల్ల మేఘరాజు, జోగు లక్ష్మిరాజం, పొట్టల కనకయ్య, గడ్డం స్వామి, ఇరుగురాల రవి, మామిడిపెల్లి అఖిల్, జలందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## మద్యం మత్తులో కారు డ్రైవింగ్

### కరీంనగర్ మాజీ మేయర్ కొడుకుపై కేసు

హైదరాబాద్, మార్చి 21 : మద్యం మత్తులో కారు నడిపి ప్రమాదాన్ని కారణమైన ఘటనలో కరీంనగర్ మాజీ మేయర్ కుమారుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ మాజీ మేయర్, బీజేపీ నేత వై సునీల్ రావు కుమారుడు వై ప్రద్యుమ్న (20) అల్వాల్ సమీపంలోని సిటిజన్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున తన స్నేహితులు యశ్వంత్ రెడ్డి, కార్తీక్ రాజ్‌తో కలిసి శంకర్‌పల్లి నుంచి జూబ్లీహిల్స్ మీదుగా కారులో వెళ్తున్నారు. ప్రద్యుమ్న కారు నడుపుతుండగా యశ్వంత్ పక్క సీట్లో కూర్చున్నాడు. అప్పటికే మద్యం తాగిన ప్రద్యుమ్న మితిమీరిన వేగంతో కారు నడిపిస్తూ జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో రాగానే అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకొని కారులో ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా కారు నడిపిస్తున్న ప్రద్యుమ్న మద్యం తాగినట్టు తేలింది. మద్యం మత్తులో కారును నడిపిన ప్రద్యుమ్నతో పాటు మిగిలిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## మట్టితో నింపితే.. నీళ్లెట్ల వస్తయ్?

- వారం నుంచి మంచినీళ్లు లేక గోసపడుతున్నం
- ఎగ్లాస్‌పూర్‌లో 'భగీరథ' అధికారులను నిలదీసిన గ్రామస్తులు



ఎగ్లాస్‌పూర్‌లో సరిపడా తాగునీరు అందించాలని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మంథనిరూరల్, మార్చి 21: మంచినీటి కోసం వారం నుంచి ఇబ్బంది పడుతుంటే.. గ్రామంలోని గేట్‌వాల్ హోల్‌ను మట్టితో నింపడం ఏంటని మిషన్ భగీరథ అధికారులను పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు నిలదీశారు. ప్రజలకు మంచినీరు అందించాల్సిన అధికారులే అడ్డదారుల్లో నీళ్లు రాకుండా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మంత్రి నియోజకవర్గంలో ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో ప్రజలకు నీటి కష్టాలు ఇంకా ఎలా ఉన్నాయోనని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో వారం నుంచి నీళ్లు లేక సతమతం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారుగా 3వేల మంది ఉంటే.. ఎంత మందికి మంచినీరు అందిస్తున్నారో అధికారులు వెల్లడించాలన్నారు. ప్రజల కోసం పని చేసే అధికారులు మంచినీరు రాకుండా ఇలా నీచమైన పనులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సందర్భంగా అధికారులు పలు వార్డుల్లో మంచి నీటి సరఫరాను పరిశీలించగా, గ్రామస్తులు వారి గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ.. ఎగ్లాస్‌పూర్ గ్రామంలో ప్రజలు పరిమితికి మించి మంచినీటిని వాడుతున్నారన్నారు. దీంతో దిగువన ఉన్న గ్రామాలకు మంచినీరు సరఫరా కావడం లేదన్నారు. రోజుకు 1.20లక్షల లీటర్ల నీటిని గ్రామానికి అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు సైతం మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## ఇఫ్తార్ విందుకు వెళ్లొస్తూ..

- బైక్‌పై ఇంటికి తిరిగివస్తుండగా తండ్రీకొడుకులకు ఢీ కొట్టిన భారీ కంటైనర్
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. దవాఖానకు తరలిస్తుండగా మృతి





షేక్‌అజీమ్ షేక్ రహమాన్ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 21: మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చి.. ఇంటికి వెళ్తున్న తండ్రీకొడుకులను ఓ కంటైనర్ మృత్యుశకటంలా ఇద్దరి ప్రాణాలను బలిగొన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మక్త గ్రామానికి చెందిన షేక్‌అజీమ్(32), షేక్ రహమాన్(11) తండ్రీకొడుకులు. రంజాన్ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం కేశవపట్నం మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే హుజూరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న ఓ భారీ కంటైనర్ అదుపు తప్పి వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో హుజూరాబాద్ దవాఖానకు తరలిస్తుండగా ఇద్దరు మృతిచెందారు. కంటైనర్ మరో బైక్‌ను సైతం ఢీకొనడంతో మెట్‌పల్లి గ్రామానికి చెందిన ఇజ్జిగిరి హరీశ్, మందాడి శ్రీనివాస్‌రెడ్డికి కూడా గాయాలయ్యాయి. తండ్రీకొడుకుల మృతితో మక్తపల్లిలో విషాదం నెలకొన్నది. తప్పించుకుని పారిపోతున్న కంటైనర్ డ్రైవర్‌ను వంకాయగూడెం శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.